సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 15 । జనవరి । 2023



- ఎక్కడెక్కడి నుంచో ఒక్కచోట చేరి
- ఇంటిల్లిపాది ఆనందంగా గడుపుతూ...
- ఘనంగా వేడుక జరుపుకుంటున్న ప్రజలు

సంక్రాంతి సందడి

ఉమ్మడి కుటుంబం.. పండుగ వైభవం

అన్నదమ్ముల ముచ్చట్లు.. యారాళ్ల చేతివంటలు.. ఆడపడుచుల కబుర్లు.. బావబామ్మర్దుల పలకరింపులు.. చిన్నారుల కేరింతలు. ఉమ్మడి కుటుంబంతో కళకళలాడుతున్న ఇండ్లు. ఈ ఆనంద క్షణాన్ని చూసి తల్లిదండ్రుల కళ్లలో కనిపించే ఆనందభాష్పాలు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటింటా ఆవిష్కృతమయ్యే దృశ్యాలు ఇవీ. ఉద్యోగం.. ఉపాధి.. పిల్లల ఉన్నతవిద్య, తదితర కారణాలతో ఉమ్మడి కుటుంబాలు విడిపోయి వేర్వేరు చోట్ల జీవనం సాగిస్తున్న తరుణం ఇది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారిలో పండుగలకు సొంత ఊరు చేరి కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్న వారు కొందరే. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలకు చెందినవారు వివిధ ప్రదేశాల్లో స్థిరపడినా.. సంక్రాంతికి సొంతింటికి వస్తామని చెబుతున్నారు. తల్లిదండ్రులతో ఆనందంగా పండుగ జరుపుకుంటామని అంటున్న వారిపై కథనం..!!

చెప్పలేని ఆనందం



బోయినపల్లిలో శ్రీపతి శ్రీహరి కుటుంబం

బోయినపల్లి(చొప్పదండి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలకేంద్రానికి చెందిన శ్రీపతి లక్ష్మి–శ్రీహరి దంపతులకు నలుగురు కొడుకులు శ్రీనివాస్, చంద్రమౌళి, క్రిష్ణహరి, జనార్దన్ ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. అందరూ వారివారి రంగాల్లో రాణిస్తున్నారు. పెద్దకొడుకు శ్రీనివాస్–కవిత దంపతుల కూతుళ్లు విజేత, సాయిప్రియలకు సైతం వివాహాలు అయి పిల్లలు ఉన్నారు. పండుగల సందర్భంలో అందరూ ఇంటికి వస్తుంటారు. ఒకేచోట వేడుక జరుపుకుంటారు. 'నాకు నలుగురు కొడుకులు. మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. రెండు తరాల అనుబంధం మాది. పండక్కి కొడుకులు, కూతుళ్లు, అల్లుండ్లు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లతో సందడిగా ఉంటుంది' అంటూ.. శ్రీపతి శ్రీహరి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

సకుటుంబ సపరివారంగా



కుటుంబసభ్యులతో బలరాం సెల్ఫీ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్తనపేటకు చెందిన బుర్రవేణి కొండయ్య–లక్ష్మి దంపతులకు ముగ్గురు కొడుకులు. ఈ ముగ్గురూ ప్రభుత్వ ఉద్యోగులు. వేర్వేరుప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నా పండుగకు ఇంటికి వస్తుంటారు. పెద్దకొడుకు బలరాం సూర్యాపేటలో సబ్‌రిజిస్ట్రార్. రెండో కొడుకు మల్లికార్జున్ హైదరాబాద్‌లో పోలీస్‌కానిస్టేబుల్. చిన్న కొడుకు భాను జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారీపేట (ఎల్‌టీ)లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు. పండుగ సందర్భంగా వీరంతా శనివారం సాయంత్రం మర్తనపేటలోని ఇంటికి చేరారు. కొండయ్య–లక్ష్మి దంపతులకు కొలనూర్, రామన్నపల్లె శివారుల్లో వ్యవసాయ భూమి ఉంది. వీరంతా పిల్లలతో పొలం వద్ద పండుగ జరుపుకుంటారు. కొండయ్య మనువలు అర్జున్, ఆదిత్య, మనవరాళ్లు ఆరాధ్య, అవంతికలతో మొక్కలు నాటించాడు. కోడళ్లు సంధ్య, రేఖ, చైతన్యలు సంక్రాంతికి పిండివంటలు చేస్తూ.. వేడుకల్లో భాగస్వాములు అయ్యారు. ఎక్కడ పని చేసినా.. పండుగకు సొంత ఊరుకు రావడం సంతోషంగా ఉంటుందని, అమ్మానాన్నలతో గడుపడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని బలరాం, మల్లికార్జున్, భాను చెబుతున్నారు.



సింగాపూర్ టు హుజూరాబాద్



టీవీ చూస్తున్న కుటుంబ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్‌లో ఉన్నా స్వదేశంపై ఉన్న మమకారంతో పండుగకు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతాడు బైరి భిక్షపతి. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బైరి భిక్షపతి గతంలో బీఎస్ఎన్ఎల్‌లో పనిచేశాడు. సింగాపూర్‌లో సాఫ్ట్‌వేర్ కొలువు రావడంతో కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. హుజూరాబాద్ పట్టణంలో ఆయన సోదరి ఉంటోంది. ఏదో ఒక పండుగకు కుటుంబంతో సహా హుజూరాబాద్ వస్తారు. చెల్లి ఇంట్లో ఓ వారం పాటు ఉండి తిరిగి సింగాపూర్ వెళ్లిపోతారు. ఈ సంక్రాంతికి వారం ముందగానే వచ్చారు.

అందరూ కలిసే..



అర్జున్‌- భీమక్క కుటుంబం

జగిత్యాల: ఉమ్మడిగానే అన్ని పండుగలు జరుపుకుంటామని జగిత్యాలకు చెందిన కొండేరి అర్జున్– భీమక్కలు చెబుతున్నారు. పట్టణానికి చెందిన అర్జున్–భీమక్కలకు ఐదుగురు కొడుకులు, కూతురు ఉన్నారు. కొడుకులు ఉద్యోగాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్నా.. తండ్రి ఆదేశాలమేరకే నడుచుకుంటారు. పెద్దలు.. పిల్లలు అంతా కలిపి 25మంది వరకు ఉంటారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇంటికి చేరి ఆనందంగా గడుపుతున్నారు.



18 ఏళ్లలో తొలిసారిగా..



గోపాల్‌రావుపల్లెలో కదారి కుటుంబం

సిరిసిల్లకల్చరల్: తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బొల్లం నారాయణరెడ్డి సుమారు 20 ఏళ్ల కిందటే అమెరికా వెళ్లి స్థిరపడ్డాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించి రాణిస్తున్నాడు. నిరంతరం బిజీగా ఉండే జీవితాన్ని గాడిలో పెట్టే క్రమంలో ఏళ్లు గడిచాయి. సంక్రాంతి రోజైనా అయిన వాళ్లందరినీ ఒకే చోట చేర్చాలనుకున్నాడు. శనివారం పెద్దమ్మ, పెదనాన్న కదారి జయ, రాజారాం రెడ్డి ఉండే గోపాల్‌రావుపల్లె చేరుకున్నాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన పెద్దమ్మ కొడుకులు ఇద్దరు పవన్, సుధ, ప్రవీణ్, బస్విలతో పాటు వాళ్ల పిల్లలు కలుసుకున్నారు. తన అర్ధాంగి వందన, కూతురు అనన్యతో పాటు అందరూ భోగి పండుగను జరుపుకున్నారు. సంక్రాంతిని సొంతఊరు బస్వాపూర్‌లో ఇంతే సందడిగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. సుమారు 18 ఏళ్ల తరువాత రెండు కుటుంబాల్లోని సభ్యులందరూ ఒకే చోటుకు చేరారు.

ఎంత బిజీగా ఉన్నా..



మల్లయ్యతో కుటుంబసభ్యులు

పెద్దపల్లిరూరల్: ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటున్నా పండుగ సమయంలో ఒకచోట చేరి సంతోషంగా గడుపుతామంటున్నారు పెద్దపల్లికి చెందిన మల్లయ్య. మల్లయ్యకు నలుగురు కొడుకులు కనకయ్య, రాము, వెంకటాచలం, నారాయణ, కూతురు వెంకటలక్ష్మి సంతానం. ఉద్యోగ రిత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. పండుగకు కుటుంబ సభ్యులతో గడిపేందుకు వెంటకలక్ష్మి కూతురు స్రవంతి ఆమెభర్త హరికృష్ణ, పిల్లలు సాత్విక్, అలోక్యతో పాటు శ్రీనివాస్, సుజాత, శ్యాంకుమార్, రాధిక, వెంకటాచలం, నారాయణ కుటుంబంతో సహా పెద్దపల్లిలోని వారి ఇంటికి వచ్చారు.

పండుగ కోసమే..



కుటుంబసభ్యులంతా ఒక్కచోట చేరి పిండివంటలు చేస్తూ...

పెద్దపల్లిరూరల్: ఉద్యోగరిత్యా హైదరాబాద్, చెన్నైలో ఉంటున్న రమేశ్, కిరణ్ సంక్రాంతికి పెద్దపల్లిలో నివాసముండే తల్లిదండ్రులు బొమ్మిదేని సమ్మయ్య, రాజేశ్వరి వద్దకు వచ్చారు. బొమ్మిదేని సమ్మయ్య ఎన్టీపీసీలో ఉద్యోగం చేసి పదేళ్లక్రితం పదవీవిరమణ పొందాడు. భార్య రాజేశ్వరి సహజ కవయిత్రి. వీళ్లకు ముగ్గురు కొడుకులు రమేశ్, కిరణ్, సతీశ్ సంతానం. రెండేళ్ల క్రితం కరోనాతో సతీశ్ మరణించాడు. రమేశ్ హైదరాబాద్‌లో, కిరణ్ చెన్నైలో ఏడేళ్లుగా ఉద్యోగం చేస్తున్నారు. రమేశ్, సునీతలకు ముగ్గురు, కిరణ్, భానుప్రియలకు ఇద్దరు, సతీశ్, శ్రుతిలకు ఇద్దరు సంతానం. పండుగకు అంతా ఒకేచోట చేరి సంతోషంగా గడిపారు.



న్యూస్‌రీల్

శివుపల్లిలో పోలీసు పికెటింగ్



తనిఖీలు చేస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

ఎలిగేడు: భోగి, సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు జరగకుండా మండలంలోని శివుపల్లిలో జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్లు, పరిసర ప్రాంతాల చుట్టూ పెట్రోలింగ్ చేపట్టారు. వాహనాలను తనిఖీలు చేశారు. శివుపల్లికి కోడి పందాలకు పుట్టినిల్లుగా పేరుంది. గతంలో ఇక్కడ బెట్టింగ్‌లు జోరుగా సాగేవి. రాష్ట్ర ఆవిర్భావం నుంచి పోలీసులు కోడి పందాల నిరోధానికి ఏటా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతిని కుటుంబసభ్యులు, బంధువులతో సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై తెలిపారు. పికెటింగ్‌లో ఏఎస్సై భాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్నసన్నిధిలో నర్సంపేట ఎమ్మెల్యే దంపతుల పూజలు

ఓదెల: ఓదెల మల్లన్న ఆలయంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీభ్రమరాంభ మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, భక్తాంజనేయస్వామి, నందీశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది సుదర్శన్‌రెడ్డి దంపతులను సన్మానించి స్వామివారి జ్ఞాపికను బహూకరించారు. వారి వెంట పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ ఉన్నారు.



ఘనంగా గోదారంగనాయకుల కళ్యాణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదారంగనాయక స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు నర్సింహాచార్యులు, సంపత్ కుమారాచార్యులు కల్యాణవేడుక నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



నాగలి దున్ని.. నాటు వేసి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలోని మెండె మహేశ్ పొలంలో రైతుగా మారారు మధ్యప్రదేశ్ రాష్ట్ర ఐఅండ్‌పీఆర్ కమిషనర్ పరికిపండ్ల నరహరి. సంక్రాంతి సందర్భంగా సొంతూరైన బసంత్‌నగర్‌కు వచ్చిన ఆయన.. రైతుతో కలిసి నాగలి దున్నారు. పొలంలో నాటు వేశారు. అన్నదాతలతో కలిసి పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ ఫౌండేషన్ ద్వారా స్వచ్ఛంద సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. సర్పంచ్ గాండ్ల మల్లేశం, కాంతయ్య, రాజేశం, చంద్రశేఖర్, కిషన్, రాజయ్య, భాస్కర్, పర్వతాలు, మల్లయ్య, వెంకన్న తదితరులున్నారు.



హరిదాసులకు కానుకలు పోస్తున్న పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి



పాలపొంగు కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, స్థానిక మహిళలు



సుల్తానాబాద్: భోగి వేడుకల్లో స్థానిక మహిళల ఆట పాటలు

ఘనంగా భోగి, సంక్రాంతి

పెద్దపల్లి రూరల్/సుల్తానాబాద్: ప్రతి ఇంటికీ సంక్రాంతి వెలుగులు రావాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం జిల్లాకేంద్రంలోని జెండాకూడలి, సుల్తానాబాద్‌లోని గాంధీనగర్‌లో భోగిమంటలను ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సుల్తానాబాద్‌లో సంబరాలను తిలకించేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత, కౌన్సిలర్లు అనుమల అరుణ, మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్, ఏఎంసీ చైర్‌పర్సన్ బుర్ర మౌనిక, మహిళలు భారీగా తరలివచ్చారు.



హరిదాసుల ఆటాపాటా



కొత్తకుండలో పాలు పోస్తున్న మహిళలు



ఆకట్టుకున్న ఎండ్లబండ్ల పోటీలు

సంపూర్ణ రక్షణతో పనులు పూర్తి చేయాలి



డ్యామ్‌ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జీఎం సాంబయ్య

రామగిరి: సింగరేణి సంస్థ ఏపీఏ పరిధిలోని 10 ఇంక్‌లైయిన్‌లో చేపడుతున్న డ్యామ్‌ల నిర్మాణ పనులను సంపూర్ణ రక్షణతో త్వరితగతిన పూర్తి చేయాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్. సాంబయ్య సూచించారు. 10ఇంక్‌లైయిన్ గనిలోని 3డిప్ నార్త్ 59వ లెవల్‌లో నడుస్తున్న వాటర్ డ్యామ్ పనులు, అలాగే 2వ సీమ్‌లో ఉన్న బెల్ట్ టన్నెల్ ఎక్స్‌ప్లోషన్ ప్రూఫ్ గోడను సందర్శించారు. డ్యామ్ నిర్మాణ పనులను రక్షణతో త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం డి.బైద్య, ఏరియా రక్షణ అధికారి సిహెచ్.వెంకట రమణ, మేనేజర్ పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన కస్తూరి రమ (29) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్సై రామస్వామి కథనం ప్రకారం.. పెళ్లి సమయంలో రమ పుట్టింటి వారు పెద్దపల్లిలో పది గుంటల భూమి ఇచ్చారు. ఆ భూమిని రెవెన్యూ రికార్డుల్లో మార్చుకోలేదు. రమ సోదరుడు సంపత్ మరణించిన తర్వాత వదిన అనిత ఆ భూమిని తనపేరిట మార్చుకుని ఇతరులకు విక్రయించింది. దీంతో మనస్తాపానికి గురైన రమ ఉరేసుకుంది. రమకు ఇద్దరు పిల్లలు సంతానం. భర్త సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గడప దాటని ఆస్తిపన్ను..!

- రామగుండంలో 65 శాతం మాత్రమే..
- వెనకబడిన మూడు మున్సిపాలిటీలు
- గడువు ముంచుకొస్తున్నా వీడని ఉదాసీనత



కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లలో పురోగతి కానరావడం లేదు. మున్సిపాలిటీల్లో ఉద్యోగులు, సిబ్బంది వేతనాలతోపాటు ఇతర అభివృద్ధి పనుల నిర్వహణకు ఆస్తి పన్ను ప్రధాన ఆదాయ వనరు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు వస్తున్నా.. ఇప్పటికీ ఆయా మున్సిపాలిటీల్లోని అధికారులు మాత్రం ఉదాసీనత వీడడం లేదు. రామగుండం నగరపాలక సంస్థలో 65 శాతం నమోదయ్యింది. మిగిలిన మూడు మున్సిపాలిటీలు మాత్రం వసూళ్లలో పూర్తిగా వెనకబడ్డాయి.

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు

జిల్లాలో రామగుండం కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు ఉన్నాయి. రామగుండంలో ప్రైవేట్ కట్టడాల ద్వారా రూ.8.90 కోట్ల వరకు డిమాండ్ ఉండగా.. రూ.5.73 కోట్ల వరకు వసూలయ్యాయి. అలాగే ప్రభుత్వ కట్టడాల ద్వారా రూ.7.40 కోట్ల వరకు డిమాండ్ ఉండగా.. రూ.4.87కోట్ల వరకు వసూలయ్యాయి. పెద్దపల్లిలో ప్రైవేట్ కట్టడాల ద్వారా రూ.4.63 కోట్ల డిమాండ్ ఉండగా, రూ.1.85 కోట్లు, ప్రభుత్వ కట్టడాల ద్వారా రూ.1.45 కోట్ల డిమాండ్ ఉండగా, రూ.3 లక్షలు వసూలైంది. సుల్తానాబాద్‌లో మొత్తం డిమాండ్ రూ.2.21 కోట్లు ఉండగా, రూ.59 లక్షలు వసూలైంది. మంథనిలో రూ.1.59 కోట్ల డిమాండ్ ఉండగా, రూ.66.12 లక్షలు వసూలు అయ్యింది.

గడువు ముంచుకొస్తున్నా స్పందన లేదు...

ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గరికొస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారుల్లో స్పందన కానరావడం లేదు. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. సకాలంలో ఇంటిపన్ను చెల్లించేలా ప్రజలను ఆయా మున్సిపాలిటీల అధికారులు చైతన్యవంతం చేయలేకపోతున్నారు. ఫలితంగా బిల్‌కలెక్టర్ ఇంటికి వెళ్లి అడిగే వరకు ఇంటి యజమాని నుంచి స్పందన రావడం లేదు. ఇంటిపన్ను ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉన్నటికీ ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదని, దీనికితోడు కొత్తగా నిర్మించిన ఇళ్లను అసెస్‌మెంట్ చేయకపోవడంతో ఆస్తి పన్ను రావడం లేదని తెలుస్తోంది.

ఈనెల పదో తేదీ వరకు వసూలైన ఆస్తి పన్ను వివరాలు

మున్సిపాలిటీ	అసెస్మెంట్స్	మొత్తం డిమాండ్	వసూలు	శాతం
రామగుండం	51,000	రూ.16.30కోట్లు	రూ.10.60కోట్లు	65 శాతం
పెద్దపల్లి	11,012	రూ.6.80కోట్లు	రూ.2.15కోట్లు	35 శాతం
సుల్తానాబాద్	5,363	రూ.2.21కోట్లు	రూ.59లక్షలు	27 శాతం
మంథని	4,709	రూ.1.59కోట్లు	రూ.66.12లక్షలు	41 శాతం

ఆస్తిపన్ను పెంపునకు స్పెషల్ డ్రైవ్



ఆస్తి పన్ను పెంపునకు 11 మంది బృందంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలని మైక్‌ల ద్వారా డివిజన్లలో ప్రచారం చేస్తున్నాం. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టిపెట్టాం. బిల్ కలెక్టర్లకు టార్గెట్ కూడా విధించాం. డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు 65 శాతం ఆస్తిపన్ను వసూలైంది. రెండు నెలల్లో 95 శాతానికిపైగా ఆస్తిపన్ను వసూలు చేస్తాం. ప్రజలు కూడా సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి.

– బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్, రామగుండం

పంటల పండుగ.. సంక్రాంతి

సుల్తానాబాద్: సంక్రాంతి పండుగ.. నువ్వుల అరిసెలు, మిఠాయిలకు పెట్టింది పేరు. గాలిపటాలు ఎగురవేయడానికి ప్రసిద్ధి. ఈ పండుగను 'పంటల' పండుగ అని.. మార్పు తెచ్చే పండుగ అని కూడా అంటారు. అందమైన ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల ప్రదర్శనలు, డూడూ బసవన్నల విన్యాసాలు ఆకట్టుకుంటాయి. సంక్రాంతి రోజు గ్రహ రాశిలో అంటే సూర్యుడి చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో ముఖ్యమైన కదలిక. ఏడాదిలో అనే సంక్రాంతులు ఉంటాయి. ఇందులో రెండు ముఖ్యమైనవి. వాటిలో ఒకటి మకర సంక్రాంతి, రెండోది దీనికి సరిగ్గా ఆరు నెలల కాలంలో.. వేసవికాలం అయనం తర్వాత వచ్చే కర్క సంక్రాంతి. ఈ రెండిటి మధ్య చాలా సంక్రాంతులు ఉన్నాయి. రాశి మారిన ప్రతిసారి దాన్ని సంక్రాంతి అనే అంటారు. ఎందుకంటే అది గ్రహగమనంలో మార్పును సూచిస్తుంది. ఈ మార్పు కారణంగానే మన జీవితాల పాలన, పోషణలు జరుగుతున్నాయని అర్థం చేసుకోవాలని సంక్రాంతి తెలియజేస్తుంది. ఈ కదలిక లేదా మార్పు ఆగిపోతే 'మనం' అనేది కూడా ఆగిపోతుంది. 22 డిసెంబరు రోజున శీతకాలపు వచ్చిందంటే సూర్యుడిపరంగా చూస్తే ఈ గ్రహం వంపు గరిష్టస్థాయికి చేరింది. ఈ రోజు నుంచి ఉత్తర గమనం చాలా బలంగా ఉంటుంది. భూమి మీద అన్నీ మారటం మొదలుపెడతాయి. మకర సంక్రాంతి నుంచి శీతాకాలం కొద్ది కొద్దిగా తగ్గుముఖం పడుతుంది.

పంట చేతికొచ్చే సమయం..

మకర సంక్రాంతి 'పంటకోతలు.. లేదా పంట మార్పిడుల' పండుగ అని కూడా పిలువబడుతుంది. ఈ సమయానికల్లా పంట నూర్పిడులు అయిపోయి ప్రజలు పెద్దఎత్తున ఉత్సవాలు జరుపుకుంటారు. పంటల్లో సహాయపడిన వారికి కృతజ్ఞత తెలుపుతారు. సాగులో పశువులు చాలా పెద్ద పాత్ర పోషిస్తాయి. పండుగ తరువాతి రోజు వాటి కోసం నిర్వహించేదే 'కనుమ'. మొదటి రోజు భూమికి, రెండో రోజు మనకు, మూడోరోజు పాడి పశువులకు.

క్లుప్తంగా

శునకానికి భోగి రేగుపండ్లు



శునకానికి రేగుపండ్లు పోస్తున్న రావి పద్మ

సుల్తానాబాద్: కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన రావి పద్మ శునకానికి రేగుపండ్లు పోశారు. భోగి సందర్భంగా పెళ్లి కాని కుమారులకు రేగుపండ్లు పోయడం హిందువుల ఆనవాయితీ. ఈ క్రమంలో తన కుమారులతో సమానంగా పెంచిన కుక్కకు రేగుపండ్లు పోసి ఆశీర్వదించారు. పంట చేతికొచ్చిన తర్వాత రైతులు ఆనందంగా జరుపుకునే మొదటి పండగ సంక్రాంతి కావడంతో ప్రజలు వేడుకలను అంగరంగా వైభవంగా నిర్వహించుకుంటున్నారు.

భారతావనిలో సంక్రాంతి ముగ్గు



ముగ్గు వేస్తున్న సావిత్రి

జ్యోతినగర్: సంక్రాంతి అంటేనే సరదాల పండుగ. మహిళలు ఇంటిముందు అందమైన రంగవల్లులు వేస్తారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ సర్రాశాలపల్లెలో పొన్నం సావిత్రి తన ఇంటి ముందు భారతదేశం ఆకారంలో ముగ్గు వేసి.. అందులో రైతు రూపాన్ని అలంకరించారు. ఈ ముగ్గును పలువురు ఆసక్తితో తిలకించారు.

ఆకట్టుకున్న పర్యావరణ ముగ్గు..



పర్యావరణంపై చైతన్యం చేసే ముగ్గుతో నీతా

సుల్తానాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన నీతారెడ్డి ఆకట్టుకునేలా ముగ్గు వేశారు. గ్రామాలు, పట్టణాల్లోకి ఇళ్ల మధ్య వానరసైన్యం రావడానికి ప్రధాన కారణం.. అడవులను నరికి వేయడమేనని, పలు రకాల చెట్లు పెంచితే వానరసైన్యం గ్రామాల్లోకి రాకుండా ఉంటుందని అర్థం వచ్చే రీతిలో ముగ్గు వేసి ఆకట్టుకున్నారు.

మాదిగ హక్కుల దండోరా జిల్లా కన్వీనర్‌గా కుమార్

సుల్తానాబాద్: మాదిగ హక్కుల దండోరా జిల్లా కన్వీనర్‌గా సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన కల్లేపల్లి కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ ఉత్తర్వులు అందించారు. సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూరు గ్రామానికి చెందిన వరికిల్ల రాజయ్య మాదిగను జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. సంఘాన్ని పటిష్టం చేయడంతోపాటు గ్రామ, మండల, పట్టణ కమిటీలు వేయాలని, సంఘం నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు.



మంచు దుప్పటి

జిల్లాను మంచు దుప్పటి కప్పేస్తోంది. ఉదయం వాతావరణమంతా మంచుతో నిండిపోతోంది. రాజీవ్ రహదారిపై మీదుగా వెళ్లే వాహనదారులకు దారి కనిపించక ఇబ్బంది పడుతున్నారు. సుల్తానాబాద్ వద్ద శనివారం ఉదయం ఇలా మంచుదుప్పటి కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి